క్లుప్తంగా

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి



రాజోళి: శాంతినగర్ పట్టణంలోని బ్యాంకులు, ప్రధాన కూడళ్ల వద్ద పోలీసులు నిఘా ఉంచారు. గురువారం పట్టణంలోని శ్రీనివాస జ్యువెలర్స్‌లో చోరీ జరిగిన నేపథ్యంలో నిఘాను పెంచారు. ఈ నేపథ్యంలో శనివారం బ్యాంకులు, ప్రధాన కూడళ్ల వద్ద తనిఖీలు చేశారు. అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

సర్వీస్ రోడ్డు నిర్మించాలి



ఉండవెల్లి: మండలంలోని బైరాపురం గ్రామానికి సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో సర్వీస్ రోడ్డు నిర్మిస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారని ప్రస్తుతం బ్రిడ్జి పనులు పూర్తి కానున్న నేపథ్యంలో సర్వీసు రోడ్డు ఏర్పాటు కుదరదని చెబుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మొయినుద్దీన్, ఖలీల్‌బాషా, నాగరాజు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం గ్రామంలో కొండపై వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం కర్ణాటక రాష్ట్రం గాజులపాడు గ్రామానికి చెందిన నర్సిరెడ్డి, సువర్ణమ్మ దంపతులు రూ. లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వసతి గృహాన్ని సందర్శించిన అధికారులు



ధరూరు: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని విద్య, వైద్య శాఖల అధికారులు వేర్వేరుగా సందర్శించారు. శనివారం మండల వైద్య శాఖ సీహెచ్‌ఓ ఆనందయ్య, ఎంఈఓ రవీంద్రబాబు తనిఖీ చేశారు. హాస్టల్ ఆవరణలో సాగు చేపడుతున్న ఆకుకూరలు, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డెన్ నర్సింహులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు మధుసూదనాచారి, రవిచారి స్వామికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అదే విధంగా సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప స్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

పాముకాటుతో ఎద్దు మృతి

మానవపాడు: పాముకాటుతో ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలోని అమరవాయి గ్రామంలో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాలు.. మండలంలోని అమరవాయి గ్రామానికి చెందిన మాల మునిస్వామి కాడెద్దులు కల్లంలో కట్టేశాడు. ఈ క్రమంలో పాముకాటుకు గురై రూ.80 వేలు విలువ చేసే ఎద్దు మృతి చెందినట్లు తెలిపారు. ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని కోరుతున్నాడు.

పరిహారం కోసం ఎదురుచూపులు

- గతేడాది పదుల సంఖ్యలో కూలిన ఇళ్లు
- కూలిన ఇళ్లపై విచారణ కరువు
- సాయం కోసం బాధితుల ఆవేదన

రాజోళి: గతేడాది మండలంలో కురిసిన భారీ వర్షాలకు పాత ఇళ్లు, మట్టి మిద్దెలు నేలకూలాయి. కూలిన ఇళ్లకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దెబ్బతిన్న, కూలిన ఇంటికి రూ.16,500 చొప్పున అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కానీ నేటికీ పరిహారం అందలేదని బాధితులు వాపోతున్నారు. గూడు చెదిరి గుప్పెడు బాధలో ఉన్న ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. కనీసం ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో కూడా పేర్లు లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేక

అధిక వర్షాల కారణంగా మండల కేంద్రం రాజోళితో పాటు మాన్‌దొడ్డి, తుమ్మిళ్ల, పచ్చర్ల, ముండ్లదిన్నె తదితర గ్రామాల్లో పాత మిద్దెలు నేలకూలాయి. మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. మొత్తం మీద ఎన్ని ఇళ్లు నేలకూలాయో అన్న వివరాలు కూడా చేపట్టడం లేదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది మండలంలో పదుల సంఖ్యలో ఇళ్లు నేలకూలితే మాన్‌దొడ్డిలో 2, ముండ్లదిన్నెలో 3, పచ్చర్ల 1, తూర్పుగార్లపాడులో 1 ఒకరికి, మొత్తం ఏడుగురికి మాత్రమే పరిహారం అందినట్లు పేర్కొన్నారు.



రాజోళిలో గత నెలలో అధిక వర్షాలకు కూలిన ఇళ్లు(ఫైల్)

సమాచారం కరువు

వర్షాలకు ఇళ్లు కూలిన వారు దరఖాస్తు చేసుకోవాలన్న కనీస సమాచారం కూడా అధికారులు ఇవ్వడం లేదని బాధితులు పేర్కొన్నారు. కొందరు దరఖాస్తు చేసుకున్న నష్ట పరిహారం కూడా అందడం లేదని వాపోతున్నారు. నెలల తరబడి ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాంపుల్లో నివాసమున్నా పరిహారం మాత్రం దక్కలేదని వాపోతున్నారు.

ప్రతి ఏడాది ఇదే తంతు

గత 4 ఏళ్లుగా వర్షాకాలంలో ఇళ్లు నేలకూలడం, గోడలు పడిపోవడం జరుగుతుంది. వారికి ప్రభుత్వం నుంచి సహాయం అందుతుందని ఎదురుచూడం తప్పా పరిహారం అందడం లేదని బాధితులు వాపోతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో కూడా ఇళ్లు మంజూరు కాకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలని పరిహారం అందని వారికి వెంటనే ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



రాజోళిలో కూలిన మట్టిమిద్దెను చూపిస్తున్న బాధితుడు(ఫైల్)

సమాచారం తెలియడం లేదు



గతేడాది వర్షాల వల్ల మా ఇల్లు కూలిపోయింది. ఈ క్రమంలో రైతువేదికలో కొన్ని నెలల పాటు తలదాచుకున్నాం. కానీ తాత్కాలిక పరిహారం కింద ప్రభుత్వం అందించే సహాయం గురించి వివరాలు తెలియలేదు. ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి పరిహారం అందలేదు. ఇందిరమ్మ ఇళ్లు కూడా మంజూరు కాలేదు.

– ప్రభాకర్, తూర్పుగార్లపాడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



గతేడాది భారీ వర్షాల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో కొన్ని ఇళ్లు కూలాయి, మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అందిన దరఖాస్తులకు రూ.16,500 పరిహారం అందజేశాం. అంతకు ముందు, గతేడాది పరిహారం అందని వారి విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– రామ్మోహన్, తహసీల్దార్, రాజోళి

కార్మిక సమ్మెను జయప్రదం చేయాలి



రాజోళిలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు



ఉండవెల్లిలో కార్మికులకు కరపత్రాలు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఉండవెల్లి: ఈ నెల 9న జరుగనున్న దేశ వ్యాప్త సమ్మెను కార్మిక సమాజం విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల చట్టాలను పునరుద్ధరించాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గౌండ బాలరాజు, సెంట్రిగ్ మధు, రంగన్న, బాలరాజు, మద్దిలేటి, సిద్ధూ, గోపి, జాను, కృష్ణ, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: ఈ నెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. శనివారం సమ్మె నోటీసును ఎంపీడీఓ ఖాజా మెయినుద్దీన్‌కు సీపీఎం నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. రాజోళి, వడ్డేపల్లి, మానవపాడు మండలాల్లోని ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు 9న శాంతినగర్‌కు చేరుకోవాలని సూచించారు. తమ హక్కుల సాధన, డిమాండ్ల పరిష్కారానికి జరుగుతున్న సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లక్ష్మన్న, రవి, నడిపన్న, తిక్కన్న, బీచుపల్లి తదితరులు పాల్గొన్నారు.

షెల్టర్లు లేక అవస్థలు



మల్దకల్‌లో బస్సు కోసం రోడ్డుపై నిరీక్షిస్తున్న ప్రయాణికులు(ఫైల్)

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

మల్దకల్: మండల పరిధిలోని వివిధ గ్రామాల స్టేజీల వద్ద బస్సుషెల్టర్లు లేక నిత్యం అవస్థలు పడుతున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో వానలకు తడుస్తూ తీవ్ర ఇబ్బందులు పేర్కొంటున్నారు. స్టేజీల వద్ద కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వందల సంఖ్యలో ప్రయాణాలు

గద్వాల– అయిజ ప్రధాన రహదారిలో మల్దకల్ మండలంలోని పెద్దపల్లి, బూడిదపాడు, అమరవాయి, మల్దకల్, తాటికుంటస్టేజీల వద్ద ప్రతి నిత్యం ప్రయాణికులు వందల సంఖ్యలో వివిధ పట్టణ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ధరూరు మండలంలోని వివిధ స్టేజీల వద్ద, గట్టు, కేటీదొడ్డి, గద్వాల మండలాల్లోని స్టేజీల వద్ద బస్సు షెల్టర్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి మల్దకల్ తిమ్మప్పస్వామిని దర్శించుకునేందుకు భక్తులు వందల సంఖ్యలో నిత్యం ప్రయాణాలు సాగిస్తుంటారు. షెల్టర్లు, బాత్రూంలు లేక అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. స్టేజీల వద్ద సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి ఆయా స్టేజీల వద్ద బస్సు షెల్టర్ల నిర్మాణం చేపట్టాలని ప్రయాణికులకు సౌకర్యాలను కల్పించాలని కోరుతున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు



బస్సు ఎప్పుడు వస్తుందో తెలియక రోడ్డుపై ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉంది. షెల్టర్ లేక వర్షాలకు తడుస్తూ అవస్థలు పడుతున్నాం. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాలి.

– రంగన్న, అమరవాయి

చర్యలు తీసుకుంటాం



నియోజకరవర్గంలోని ఆయా స్టేజీల వద్ద బస్సు షెల్టర్ల నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తాం. అధికారుల సూచన మేరకు ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– సునీత, గద్వాల డిపో మేనేజర్

గట్టు ఎంఈఓగా వెంకటేశ్వర్లు

గట్టు: ఎంఈఓగా మాచర్ల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంఈఓగా పనిచేస్తున్న గట్టు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నల్లారెడ్డి సెలవుపై వెళ్లగా సీనియర్ హెచ్‌ఎంగా ఉన్న వెంకటేశ్వర్లుకు ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ చెన్నయ్యకు జాయినింగ్ రిపోర్టు అందజేశారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

జీరో ఎన్‌రోల్మెంట్ పాఠశాల సందర్శన



ధరూరు: మండల పరిధిలోని మీర్జాపురంలో ఉన్న జీరో ఎన్‌రోల్మెంట్ పాఠశాలను ఎంఈఓ రవీంద్రబాబు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడారు. త్వరలో పాఠశాలను పునః ప్రారంభిస్తామని పిల్లలను బడికి పంపాలని గ్రామస్తులను ఎంఈఓ కోరారు.

రైతులు నమోదు చేయించుకోవాలి



అయిజ: ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీ (భూధార్ కార్డు రిజిస్ట్రేషన్) చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి జనార్దన్ అన్నారు. శనివారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఏఈఓలు రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రిజిస్టర్ చేసుకున్న రైతులకు ప్రధానమంత్రి కిసాన్ యోజన, ఫసల్ బీమా వంటి పథకాలు పొందవచ్చని పేర్కొన్నారు.

మెరుగైన విద్య అందించాలి



కేటీదొడ్డి: విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అడ్మిషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం, హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యా బోధన, ఆవరణ పరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓ పద్మావతి, సీఆర్పీ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనలో రాజీపడొద్దు

ఎర్రవల్లి: గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని వసతులను కల్పించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అధికారులను ఆదేశించారు. శనివారం ఇటిక్యాల మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న వసతుల స్థితిగతులపై క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల భద్రత, పరిశుభ్రత, ఆరోగ్యం, అభ్యాస వాతావరణంపై రాజీ లేకుండా వ్యవహరించాలన్నారు. విద్యార్థులకు పాఠాలు స్పష్టంగా అర్థమయ్యేలా బోధించడంపై దృష్టి పెట్టాలన్నారు. భోజన నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని, మెనూ ప్రకారం పౌష్టిక విలువలతో కూడిన ఆహారం అందించాలన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, సృజనాత్మకత వంటి కార్యక్రమాల్లో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. వసతులపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణానికి కావాల్సిన అన్ని సదుపాయాలను ప్రభుత్వ పూర్తిగా కల్పిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇటిక్యాలలో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

దేవాలయ భూములు అన్యాక్రాంతం

గద్వాల: గట్టు మండల పరిధిలోని ఇందువాసి ఇంజమ్మవ్వ దేవాలయానికి చెందిన భూములను కొందరు అన్యాక్రాంతం చేసుకొని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఇందువాసి గ్రామస్తులు శనివారం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శనివారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ఆందోళన నిర్వహించారు. ఇందువాసి గ్రామ శివారులోని సర్వే నంబర్ 775లోని 16.03 ఎకరాల దేవాలయ భూమిని ఇతరులకు విక్రయించేందుకు స్లాటును కూడా బుక్ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. దేవాలయ భూమిని ఇది వరకే 2 ఎకరాలను ఇతరులకు విక్రయించారని, మిగులు భూమిని కూడా విక్రయించేందుకు సిద్ధమైనట్లు ఆరోపించారు. ఈ వ్యవహారంపై గతంలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఇందువాసి గ్రామస్తులు

మొక్కలే మానవాళికి జీవనాధారం



ఉండవెల్లిలో మొక్కలు నాటుతున్న నాయకులు



ఎర్రవల్లిలో మొక్కలు నాటుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ఎర్రవల్లి: మొక్కలే మానవాళికి జీవానాధారమని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ (పుటాన్‌దొడ్డి) కార్యాలయంలో అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సిబ్బందితో కలిసి కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. భవిష్యత్ తరాలకు మొక్కలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ సహకార దినోత్సవం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్య వసాయ సహకార గోదాం ఆవరణలో అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ గజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కలుగోట్ల పీఏసీఎస్‌లో ఎస్పీఓ ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్‌కి ఎంపిక కావడంతో రైతులందరూ భాగస్వామ్యులు కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సిబ్బంది హర్షం

రాజోళి: ఐక్యరాజ్యసమితి 2025 సంవత్సరాన్ని సహకార సంవత్సరంగా ప్రకటించడంపై పీఏసీఎస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శాంతినగర్‌లోని పీఏసీఎస్ కార్యాలయంలో ఏక్ పేడ్ మాకే నామ్(అమ్మ పేరుతో ఒక మొక్క) కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

గద్వాల: నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని డీసీఓ మహేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. గట్టులోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ఆవరణలో సహకార దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు మహదేవప్ప, నాయకులు రామకృష్ణారెడ్డి, మోహన్‌గౌడు, సిబ్బంది పాల్గొన్నారు.

విపత్తులపై అప్రమత్తంగా ఉండాలి



అయిజలో మాట్లాడుతున్న తహసీల్దార్ జ్యోతి

అయిజ: విపత్తులపై అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జ్యోతి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో డిజాస్టర్ మేనేజ్మెంట్ (విపత్తు నిర్వహణ)పై తహసీల్దార్ వివిధ శాఖల అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. సహజ లేదా మానవ నిర్మిత విపత్తుల (ప్రకృతి వైపరీత్యాలు, భూకంపాలు, వరదలు, అగ్ని ప్రమాదాలు) వలన ప్రజలకు నష్టం కలుగకుండా వీలైనంత వరకు అధికారులు మమేకమై ప్రజలను రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. విపత్తు సంభవించే ముందు ప్రజలకు హెచ్చరికలు జారీ చేయాలని, అత్యవసర ప్రణాళికలు తయారుచేసి అమలు చేయాలన్నారు. విపత్తు సంభవించిన వెంటనే చర్యలు తీసుకోవాలని, రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించాలన్నారు. సకాలంలో వైద్య సహాయం, నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలన్నారు. విపత్తుల ప్రభావాన్ని తగ్గించేందుకు దీర్ఘకాలిక చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా నదీ పరివాహక ప్రాంతాల్లో నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, మెడికల్ ఆఫీసర్ విష్ణు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన

మానవపాడు: ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలు సురక్షితంగా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ భాస్కర్, తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ, సీడీపీఓ సుజాత అన్నారు. మండల కేంద్రంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

ఇటిక్యాల: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు గ్రామాల్లో అందుబాటు ఉండాలని తహసీల్దార్ వీరభద్రప్ప అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విపత్తులపై మండల స్థాయి అధికారులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. అకస్మాత్తుగా సంభవించే విపత్తులపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో కూలేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్లను గుర్తించి వాటిని ఖాళీ చేయించాలన్నారు. వర్షం నీరు నిల్వకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు విపత్తులతో పాటు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఎస్సై వెంకటేష్, డీటీ నందినిపాల్గొన్నారు.

విపత్తుల నిర్వహణపై సమీక్ష

గట్టు: విపత్తుల సమయంలో అధికారులు సిద్ధంగా ఉండాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ వియ్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విపత్తుల నిర్వాహణ(డిజాస్టర్ మేనేజిమెంట్) కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల స్థాయి అధికారులతో కలసి విపత్తుల నిర్వాహణ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపీడీఓ, ఎంఈఓ, ఎస్ఐ, విద్యుత్ ఏఈ, పీఆర్ఏఈ, ఆర్అండ్‌బీ ఏఈ, వైద్యాధికారి, పశువైద్యాధికారులు కమిటీ సభ్యులుగా ఉండనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ లక్ష్మన్న, ఎంపీడీఓ చెన్నయ్య, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఏఓ హనుమంతురెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.